క్లుప్తంగా

పైడితల్లి అమ్మవారికి దేవన్‌రెడ్డి పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న తిప్పల దేవన్‌రెడ్డి దంపతులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 64వ వార్డు వెంకన్నపాలెం గ్రామ దేవత పైడితల్లి అమ్మవారి పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, ఎమిలీ జ్వాల దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలోనాయకులు ధర్మాల శ్రీను, బొడ్డ గోవింద్,తాతరెడ్డి, జగదీష్‌రెడ్డి, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ ప్రత్యేక శిబిరం ప్రారంభం



ఆధార్ క్యాంప్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ గంగారావు

ఉక్కునగరం: జీవీఎంసీ 79వ వార్డు ఉక్కునగరంలో ఆధార్ ప్రత్యేక శిబిరం మంగళవారం ప్రారంభమైంది. వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు మాట్లాడుతూ కొత్తగా ఆధార్ కార్డు, ఆధార్ కార్డులో మార్పులు, అడ్రస్, పుట్టిన తేదీ, మొబైల్ నెంబర్‌లను సరి చేసుకోవచ్చన్నారు. అదే విధంగా బయోమెట్రిక్ అప్డేషన్‌తో పాటు డాక్యుమెంట్ అప్డేషన్ చేసుకునే సేవలు అందుబాటులో ఉన్నాయనారు. ఈ నెల 28 వరకు నిర్వహించనున్న శిబిరాన్ని ఉక్కునగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో శ్రీనివాస రాజు, పుల్లారావు, రాజా, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లిష్‌పై పట్టు ఉంటే ఉపాధి అవకాశాలు



నాటికను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

అక్కిరెడ్డిపాలెం: ఇంగ్లిష్ భాషా దినోత్సవాన్ని మంగళవారం 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఇంగ్లిష్‌లో వివిధ అంశాలపై ప్రసంగించారు. పాఠశాల హెచ్‌ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం మాట్లాడుతూ విద్యార్థులు ప్రారంభ దశ నుంచే ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలన్నారు. ఆంగ్లంలో పట్టు సాధిస్తే ఉద్యోగ, ఉపాధికి మార్గం సులభతరం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుమారస్వామి, ఉషారాణి, గిరిబాబు, పీడీ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ కేశవరావు

ఉక్కునగరం: విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్ సీఐ ఈ.కేశవరావు అన్నారు. స్థానిక డీపాల్ పాఠశాలలో మంగళవారం సైబర్ క్రైం అండ్ సెక్యూరిటీపై విద్యార్థులకు అవగాహన కార్య క్రమం నిర్వహించారు. సీఐ కేశరావు మాట్లాడు తూ సైబర్ నేరాలు, వాటిని నుంచి దూరంగా ఉండటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఆయన కొన్ని సలహాలు, సూచన లు చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఫాదర్ అనీస్ మాథ్యూ విద్యార్థులకు పలు అంశాల గురించి వివరించారు. పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ షాజీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దుర్గమాంబ ఆలయ వార్షికోత్సవం నేడు

అగనంపూడి: అగనంపూడి నిర్వాసితకాలనీ డొంకాడ ప్రజల ఆరాధ్య దైవం దుర్గమాంబ ఆలయం 22వ వార్షికోత్సవం బుధవారం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది. ఈ సందర్భంగా అమ్మవారికి లలిత సహస్ర పారాయణ, ఉదయం అమ్మవారి సారె ఊరేగింపు గ్రామంలోని రామాలయం నుంచి ప్రారంభించనున్నామని పేర్కొన్నారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహిస్తారు.

కబ్జాకు కాదేదీ అనర్హం అన్నట్టు వ్యవహరిస్తున్నారు అక్రమార్కులు... ఈ భాగోతం కళ్లెదుట కనిపిస్తున్నా నిద్ర నటిస్తున్నారు అధికారులు. వడ్ల పూడిలో విశాలంగా ఉన్న గెడ్డను ఆక్రమించి కొంత మంది దర్జాగా విక్రయిస్తున్నారు. దీంతో సుమారు 20 మీటర్లు ఉన్న గెడ్డ 15 అడుగులకు కుదించుకుపోయింది. అయినా అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేదు. అది చాలదన్నట్టు ఆక్రమణలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేలా గెడ్డ వైశాల్యంతో సంబంధం లేకుండా.. రెండు వైపులా రక్షణ గోడలు నిర్మించేస్తున్నారు. దీంతో ముప్పు పొంచి ఉందని ఆ ప్రాంత వాసులు ఆందోళన చెందుతున్నారు. అకాల వర్షాలు కురిస్తే ఎలాంటి ఉపద్రవం వస్తుందోనని భయపడుతున్నారు. ఉన్నతాధికారులు సర్వే చేసి గెడ్డను కాపాడాలని **ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.**



గెడ్డకు ఇరువైపులా ఆక్రమణలు



పనులు చేపట్టక ముందు విశాలంగా కాలువ

గెడ్డను మింగేస్తున్నారు!

- ఆక్రమించి దర్జాగా అమ్మకాలు
- పట్టించుకోని అధికారులు
- భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్న ప్రజలు

ఆక్రమణ దారుల చేతుల్లో వడ్లపూడి గెడ్డ బందీ

కూర్మన్నపాలెం: కొంతమంది బడానాయకుల చేతుల్లో వడ్లపూడి ప్రధాన కాలువ బందీ అయిపోతుంది. ఫలితంగా జలయేరులా ప్రవహించే ఆ గెడ్డ రోజు రోజుకూ కుంచించుకుపోతుంది. అయినా అటు రెవెన్యూ, ఇటు జీవీఎంసీ అధికారులు పట్టించుకున్న పాపానపోవడంలేదు. దీంతో పలుకుబడి ఉన్న కొంతమంది పెద్దల సహాయంతో గెడ్డను ఆక్రమించి దర్జాగా నిర్మాణాలు చేసేస్తున్నారు. ఇప్పటికే అనేక మంది తమ భవనాలకు గెడ్డ అడ్డులేకుండా ముందు ప్రాంతమంతా ఆక్రమించి వారి స్వాధీనంలోకి తీసుకున్నారు. మరి కొంతమంది రేకుల షెడ్లు, చిన్న చిన్న ఇళ్లు నిర్మించి అద్దెలకు ఇచ్చేస్తున్నారు.

ఆక్రమణ దారుల నుంచి వసూళ్లు

గెడ్డకు ఆనుకుని ఉన్న వారి చేతుల్లో ఉన్న స్థలానికి కూడా స్థానిక నేతలు వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వారు తమ పరిధిలో ఉన్న స్థలాన్ని బట్టి రూ.2 నుంచి రూ.3 లక్షల వరకూ నాయకులకు కప్పం కడుతున్నారు. మరికొన్ని స్థలాలను నాయకుల అనుచరులు విక్రయించేస్తున్నారు. దీంతో గెడ్డ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు ముమ్మరం చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో ముప్పుసంభవించే ప్రమాదం ఉందని ఆయా కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పూర్వం గెడ్డ విశాలంగా ప్రవహించినప్పుడే వర్షాకాలంలో పొంగి పొర్లుతుండేదని ప్రజలు చెబుతున్నారు. అలాంటిది 10 నుంచి 15 అడుగులకు కుదించేసి పనులు చేపడితే ముంపు ముప్పు తప్పదని భయపడుతున్నారు.

అధికారుల తీరుపై విమర్శలు

కొంతమంది పెద్దల అవసరాలకు అనుగుణంగా గెడ్డను మలుచుకుంటున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీల నివాసులు చెబుతున్నారు. ఈ ఆక్రమణలపై లెక్కకు మించి ఫిర్యాదులు చేసినా ఏ అధికారి వాటిని పరిశీలించిన పాపానపోలేదని వారు అంటున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని గతంలో గెడ్డ ఎంత విస్తీర్ణం ఎంత ఉంది... ఇప్పుడు ఎంత తగ్గిందని సర్వే చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

టౌన్‌ప్లానింగ్ అధికారులకు లేఖ రాశాం

ప్రధాన కాలువ ఆక్రమణలపై ఇప్పటికే ప్రణాళిక విభాగం అధికారులకు లేఖ రాశాం. ఆ విభాగం అధికారులు ఎంతవరకు గుర్తిస్తారో చూసి కాలువ పక్కన మిగిలిన స్థలంలో రహదారి నిర్మిస్తాం. కాలువ వెడల్పులో తేడాలు ఉండడం వల్ల సరాసరి చేసి రక్షణ గోడలు నిర్మిస్తున్నాం. అలా నిర్మించడం వల్ల భవిషత్తులో ఎక్కడా చెత్త చెదారం, మురుగు, వరద నీరు నిలిచిపోయే అవకాశాలు ఉండవు.

– అప్పారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, జీవీఎంసీ

ఇదీ పరిస్థితి

వడ్లపూడి నిర్వాసితకాలనీల ఎగువ ప్రాంతాల నుంచి అనేక పిల్ల కాలువల ద్వారా వచ్చే వాడుక నీటితో పాటు వర్షపు నీరు ఈ గెడ్డలో వచ్చి చేరుతుంది. ఆ నీరు దిగువ ప్రాంతాల ద్వారా ప్రవహించి సముద్రంలో కలిసిపోతుంది. ఈ కాలువ 20 మీటర్లు వెడల్పు ఉండేది. ఆ గెడ్డకు రక్షణగోడ నిర్మించాలని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిధులు కేటాయించింది. దీనిలో భాగంగా నాటి ఎమ్మెల్యే తిప్పలనాగిరెడ్డి శంకుస్థాపన కూడా చేశారు. అంత వరకు బాగానే ఉన్నా ఎన్నికలు జరిగిన తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో స్థానిక నాయకులు గెడ్డపై కన్నేశారు. దీంతో ఆక్రమణల జోలికి వెళ్లకుండా పనులు చేపడుతున్నారు.



గతంలో కాలువ పరిస్థితి (ఫైల్)

ఉక్కు అమరవీరులకు నివాళి



అమరులకు ఉక్కు స్మృత్యంజలి పార్కు వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఆవిర్భావ దినోత్సవాన్ని యాజమాన్యం నిర్వహించక పోవడం దుర్మార్గమని ఉక్కు కార్మిక సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉక్కునగరం స్మృత్యంజలి పార్కు వద్ద మంగళవారం నాయకులు ఉక్కు అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అనేక మంది బలిదానాలతో ఏర్పడిన స్టీల్‌ప్లాంట్ ఆవిర్భావ దినోత్సవాన్ని గతేడాది వరకు యాజమాన్యం నిర్వహించిందన్నారు. ఈ ఏడాది అర్ధాంతరంగా వేడుకలను నిలిపివేయడం ఏంటని వారు ప్రశ్నించారు. ఉక్కు ఉత్పత్తి కోసం క్రమశిక్షణ, అంకితభావంతో పని చేసే ఉద్యోగులకు నెహ్రూ అవార్డులతో సత్కరించాల్సిన కార్యక్రమాన్ని ఎందుకు నిలిపేశారన్నారు. యాజమాన్యం వైఖరి మార్చుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి. ఆదినారాయణ, కె.ఎస్.ఎన్. రావు, జె.అయోధ్యరామ్, యు. రామస్వామి, కారు రమణ, వరసాల శ్రీనివాసరావు, రామ్మోహన్‌కుమార్, దొమ్మేటి అప్పారావు పాల్గొన్నారు.

సిటీ పోలీస్‌పై గాజువాక గ్రీన్స్ విజయం

విశాఖ స్పోర్ట్స్: యూసీసీ టీ20 క్రికెట్ పోటీల్లో సిటీ పోలీస్‌పై 106 పరుగుల తేడాతో గాజువాక గ్రీన్స్ విజయం సాధించింది. రైల్వేస్టేడియంలో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కౌంటీ సీసీ జట్టు 8 వికెట్లకు 111 పరుగులు చేసింది. ప్రతిగా గెలాక్సీ సీసీ ఆరు వికెట్లు కోల్పోయి 17.2 ఓవర్లలోనే విజయాన్నందుకుంది. జింక్ గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన గాజువాక గ్రీన్స్ ఏడు వికెట్లు కోల్పోయి 189 పరుగులు చేసింది. ప్రతిగా సిటీపోలీస్ 83 పరుగులు చేసింది. మరో మ్యాచ్‌లో విజయనగరం జట్టు 40 పరుగుల తేడాతో యలమంచిలి సీసీపై విజయం సాధించింది. దీంతో వరుసగా ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గాజువాక గ్రీన్స్, విజయనగరం జట్లు విజయకేతనం ఎగురవేశాయి.

ప్రణాళికతో చదివితే మంచి మార్కులు



ఇస్లాంపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో కలిసి విక్టరీ సింబల్ చూపిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

డీఈవో ప్రేమ్‌కుమార్

పెదగంట్యాడ: ప్రణాళిక ప్రకారం చదివితే మంచి మార్కులు వస్తాయని జిల్లా విద్యా శాఖాధికారి ప్రేమ్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. చదువులో వెనుకబడి ఉన్న విద్యార్థులతో సంభాషించారు. ప్రతి ఒక్కరూ బాగా చదవాలని, మంచి మార్కులతో పదో తరగతి ఉత్తీర్ణులు కావాలన్నారు. ఉన్నత శిఖరాలు అధిరోహించాలంటే దానికి చదువే ముఖ్య కారణమన్నారు. విద్యార్థి దశలోనే లక్ష్యాలను ఏర్పరచుకోవాలని, వాటిని సాధించేలా శ్రద్ధతో చదవాలని సూచించారు. పదో తరగతి పరీక్షలకు సమయం దగ్గర పడుతోందని, విద్యార్థులు ఆందోళనకు లోను కాకుండా పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వారు కూడా చదువులో ముందుండేలా సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ

పెదగంట్యాడ: సామాజిక పరిస్థితులకు అనుగుణంగా విద్యా విధానంలో అనేక మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుడుతోందని సమగ్ర శిక్ష ఏఎంవో లక్ష్మి అన్నారు. మండల పరిధిలోని 52 అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేస్తున్న టీచర్లకు నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరు రోజుల పాటు నిర్వహించనున్న జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని మండల విద్యా శాఖాధికారి ఇ.శ్రీనివాసరావు, నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. విద్యా శాఖతో పాటు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమంపై ఐసీడీఎస్ పెందుర్తి ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఇక్కడ శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులను గుర్తించి వారిని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. రిసోర్స్ పర్సన్లుగా ఎస్‌వీఎస్‌ఎస్‌ఎస్‌ఎల్‌ఎంవీ మూర్తి, షేక్ రంజాన్, సూరిబాబు వ్యవహరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుజాత, లక్ష్మి, ప్రథమ ఫౌండేషన్ ప్రతినిధి ప్రమీల, సీఆర్‌పీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సమగ్ర శిక్ష ఏఎంవో లక్ష్మి

శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించిన డీఈవో

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు మిందిజిల్లా పరిషత్ హైస్కూల్లో ఎఫ్‌ఎల్‌ఎన్ (జ్ఞాన జ్యోతి)పై అంగన్‌వాడీ వర్కర్స్‌కు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం డీఈవో ప్రేమ్ కుమార్ సందర్శించారు. అంగన్‌వాడీతో పలు అంశాలపై మాట్లాడారు. ప్రోగ్రాం కో ఆర్డినేటర్, ఎంఈవో వి.విశ్వనాథం ఈసీసీఈ పిల్లలకు ఎలా బోధించాలో వివరించారు. కార్యక్రమంలో పలువురు ఆర్‌పీలు పాల్గొన్నారు.

ఘనంగా ధారాలమ్మ ఆలయ వార్షికోత్సవం



ధారాలమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

కూర్మన్నపాలెం: వడ్లపూడిలోని ధారాలమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. 87వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు కోమటి శ్రీనివాస రావు,రమాదేవి దంపతులు దారాలమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకుని పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించారు. పెద్దలు గాలి నూకరాజు, బొత్స లక్ష్మణరావు,నడుపూరి నూకరాజు, మజ్జి ఉషా, గూన పద్మ, సుబ్బాయమ్మ తదితరులుఅమ్మవారికి అభిషేకాలు చేశారు.

టిడ్కో నివాసితులకు తాగునీరు సరఫరా



ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్న దృశ్యం

పెదగంట్యాడ: టిడ్కో గృహాల్లో నివాసం ఉంటున్న వారికి జీవీఎంసీ నీటి సరఫరా విభాగం అధికారులు మంగళవారం ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేశారు. టిడ్కో గృహాల్లో కొన్ని రోజులుగా నివాసితులు ఉంటున్నారు. అయితే అక్కడ ఎటువంటి సదుపాయాలు కల్పించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో సీపీఐ నాయకులు స్పందించి తాగునీరు అందించాలని అధికారులను కోరారు. స్పందించిన అధికారులు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేశారు.

కీటకజనిత వ్యాధులపై అప్రమత్తం



మాట్లాడుతున్న డాక్టర్ శాంతిప్రభ

మహారాణిపేట: దోమల వల్ల సంక్రమించే మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ శాంతి ప్రభ అన్నారు. మంగళవారం జగదాంబ వద్ద గల బిల్ జంక్షన్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పట్టణ/ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు, సిబ్బంది సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ వ్యాధులు దోమల వల్ల వస్తాయని, దోమల నివారణకు ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. జిల్లా మలేరియా అధికారి తులసి మాట్లాడుతూ దోమల వల్ల వచ్చే వ్యాధులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలన్నారు. వ్యాధి నిరోధక టీకాలు అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యాధికారులకు ఎన్.వి.బి.డి.సి.పి. ప్రోగ్రాం (నేషనల్ వెక్టార్ బోర్న్ డిసీస్ కంట్రోల్ ప్రోగ్రాం) కింద మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ వంటి కీటక జనిత వ్యాధులపై పునశ్చరణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నివారణాధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు, వైద్య ఆరోగ్యశాఖ నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, వివిధ విభాగాల అధికారులు బి.రమేష్, డాక్టర్ లూసీ, ఐ.మనోరమ, తులసి, మురళీకృష్ణ, శశిభూషణ్, రమేష్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

టెండర్ల ఖరారులో జాప్యమేల?

దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధుల మండిపాటు

అగనంపూడి: విశాఖలో దక్షిణ కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ కార్యాలయ భవనాల నిర్మాణానికి ప్రధాన మంత్రి మోదీ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేసి రెండు మాసాలు కావస్తున్నా నేటికీ టెండర్లు ఖరారు చేయకపోవడంపై దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మండిపడుతున్నారు. దువ్వాడలో అసోసియేషన్ ప్రతినిధులు కె.ఈశ్వర్, కె.చంద్రరావు మంగళవారం మాట్లాడారు. రూ.149.16 కోట్ల వ్యయంతో 24 నెలల వ్యవధిలో పూర్తి చేయడానికి భువనేశ్వర్‌లోని తూర్పు కోస్తా రైల్వే అధికారులు టెండర్లు పిలిచారని, రెండు మాసాలు కావస్తున్నా నేటికీ ఖరారు చేయలేదన్నారు. ఇంకా 22 నెలల్లో భవన నిర్మాణ పనులు ఎలా సాధ్యమవుతాయని వారు ప్రశ్నించారు. సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు కోరితే ఇంకా టెండర్ల ఖరారు చేసే పనిలో ఉన్నామని సమాధానం ఇవ్వడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. రైల్వే మంత్రి, రైల్వే శాఖ ఉన్నతాధికారులు, స్థానిక ఎంపీ స్పందించి వెంటనే టెండర్లు ఖరారు చేయించి పనులు చేపట్టేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

మహిళల భద్రతకు చట్టాలు దోహదం

దాబాగార్డెన్స్: మహిళల ఆత్మరక్షణకు ఎన్నో మార్గాలున్నాయని మహిళా పోలీస్ స్టేషన్ ఏసీపీ సీహెచ్ పెంటారావు అన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో మంగళవారం మహిళా పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళా చట్టాల కోసం తెలుసుకోవాలని, ప్రేమ వ్యామోహంలో పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. ఉన్నత చదువులు చదివి, మంచి ఉద్యోగాల్లో స్థిరపడితే మంచి వరుడు వస్తాడని, సోషల్ మీడియా ద్వారా అపరచిత వ్యక్తులను నమ్మి, వారితో ప్రేమ వ్యవహారాల్లో పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. రిటైర్డ్ జడ్జి పైలా సన్నిబాబు మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో చదివిస్తారని, వారి ఆశలు వమ్ము చేయొద్దని, తల్లిదండ్రులను ప్రేమించి, వారి అడుగు జాడల్లో ఉన్నత చదువులు చదివి ఉద్యోగాల్లో స్థిరపడాలన్నారు. కార్యక్రమంలో సందీప్, ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కదారి కుమార్, మహిళా పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ భీశెట్టి వెంకటేశ్వరరావు, హిమా హ్యూమానిటేరియన్ సంస్థ వ్యవస్థాపకుడు టీవీడీ దాస్, బండారు రామారావు, టి. రాజేశ్వరి, రమ్య, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

32 మంది త్యాగాల ఫలితమే స్టీల్‌ప్లాంట్



కేక్ కట్‌చేస్తున్న వైఎస్సార్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మంగళవారం వైఎస్సార్‌టీయూసీ యూనియన్ పాయింట్ వద్ద నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ 32 మంది ప్రాణ త్యాగాలతో సాధించిన విశాఖ స్టీల్‌ప్లాంట్ వ్యవస్థాపక దినోత్సవాన్ని యాజమాన్యం అధికారికంగా చేయకపోవడం వెనుక కుట్ర ఉందన్నారు. ఒకవైపు ప్యాకేజీ ఇచ్చామని చెబుతూ జీతాలు ఇవ్వకుండా, ఇలాంటి కార్యక్రమాలు నిలిపి వేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు మార్టుపూడి పరదేశి, పిట్టారెడ్డి, దరిగి రవి, జి.పి.ఆర్. రెడ్డి, జి.అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్ మీదుగా గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న నిందితులను మంగళవారం రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి 8.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విశాఖ రైల్వే స్టేషన్‌లో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ ఎస్ రామారావు, ఆర్పీఎఫ్/ఐపీఎఫ్ ఎస్ఐ రామకృష్ణ, సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. కేరళ రాష్ట్రం, కొల్లాం జిల్లాకు చెందిన అమల్ ఎస్ఆర్ గంజాయి రవాణా చేయడాన్ని గుర్తించారు. నిందితుడిని జీఆర్పీ ఎస్ఐ ఎస్ రామారావుకు అప్పగించారు.

పోర్టు ఆస్పత్రి ప్రైవేటీకరణ ఆపే వరకు పోరాటం



పోర్టు హాస్పిటల్ వద్ద దీక్షలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

తాటిచెట్లపాలెం: పోర్టు ఆస్పత్రి ప్రైవేటీకరణ ఆపేవరకు పోరాటం చేస్తామని, సొంత నిధులతోనే పోర్టు హాస్పటల్‌ను అభివృద్ధి చేయాలని సీఐటీయూ అధ్యక్షుడు జె.సత్యనారాయణ డిమాండ్ చేశారు. పోర్టు ఆస్పత్రి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న రిలే నిరాహారదీక్షలు మంగళవారానికి 142వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా దీక్షలో పాల్గొన్న సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వేల కోట్ల రూపాయలు లాభాలు సంపాదిస్తున్న పోర్టు, అందులో పనిచేసే ఉద్యోగుల ఆరోగ్యంతో వ్యాపారం చేయడం సమంజసం కాదన్నారు. ఈ సంవత్సరం సుమారు రూ.800 కోట్లు లాభాలు వచ్చాయని, దీంట్లో నాలుగోవంతు ఖర్చుపెట్టినా ఈ హాస్పటల్‌లో ఖాళీగా ఉన్న డాక్టర్స్, సిబ్బందిని నియమించవచ్చని, ఈ రకంగా ఆలోచించకుండా ప్రైవేటు వాళ్లకి ధారాదత్తం చేయాలనుకోవడం దుర్మార్గమైన చర్య అని తెలిపారు. వెంటనే ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేకుంటే నిరసనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మంగళవారం జరిగిన దీక్షలో సత్యనారాయణ, ఎస్ సాధుబాబు, జీసీహెచ్‌వై నాయుడు, రాజగోపాలరావు, సీహెచ్‌వీఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.